# వసుధైక కుటుంబం

దూరం నుండి కాళ్ళీడ్చుకుంటూ మెల్లగా అడుగులు వేసుకుంటూ వస్తున్న భర్తను చూసింది సుమిత్ర.

ముప్ఫయి గజాలు దూరం నడిచిరావటానికి అయిదు నిమిషాలు పట్టిందతనికి. దగ్గరకు వచ్చి నీరసంగా సుమిత్ర పక్కనే నేలమీద కూలబడిపోయేడు సుధీర్.

అతడి చొక్కా చిరిగిపోయివుంది! అతడి ఫేంటు మట్టికొట్టుకుని పోయింది. జుత్తు అంతా చెదిరిపోయి చూడటానికి చాలా అసహ్యంగా వుంది. రెండు నిమిషాలసేపు భర్తవంకే చూస్తూ వుండిపోయింది సుమిత్ర.

అతడు మోకాళ్ళలో తల దూర్చుకుని కూర్చుని వుండిపోయాడు. స్వరం కూడగట్టుకుని అడిగింది

"ఏమండీ... మన బాబు ఆచూకీ ఏమైనా తెల్సిందా?" ఎంతో ఆత్రుతగా అడిగింది కానీ భర్తనుండి వినబోయే సమాధానం ఆమెకుతెలుసు.

లేదన్నట్లుగా తలపైకి ఎత్తకుండానే ఇటూ అటూ ఆడించేడు సుధీర్. గొల్లుమంటూ మళ్ళీ ఏడుపు ఆరంభించింది సుమిత్ర.

నిన్నటి నుండీ ఏడ్చి ఏడ్చి గొంతు బొంగురు పోవటంవల్ల, స్వరం చాలా భయంకరంగా బయటకు వచ్చింది. తుళ్ళిపడి తల ఎత్తి చూసేడు సుధీర్.

"సుమిత్రా... ఊరుకో... ప్లీజ్" బ్రతిమిలాడుతున్న స్వరంతో అడిగేడు.

సుమిత్ర ఊరుకోలేదు పిచ్చిదానిలా ఏడుస్తూనే వుంది. శూన్యంలోనికి చూస్తూ హృదయవిదారకంగా రోదిస్తూనే ఉంది. సుధీర్ అయిదు నిమిషాలసేపు ఆమెను సముదాయించేందుకు వ్యర్థ ప్రయత్నం చేశాడు.... సాధ్యంకాలేదు. నిస్సహాయంగా ఆమె వంక చూస్తూ వుండిపోయాడు.

ఎదురుగా అరఫర్లాంగు దూరంలో ...

పెద్దనది వుంది! నిన్న మధ్యాహ్నం కొన్ని వందల మందిని పొట్టబెట్టుకున్న నది ఎంతో నిశ్చలంగా, నిద్రిస్తున్న రాక్షసుని మహాకాయంలా కనిపిస్తోంది!. ఆ నది కుడివైపుకు వంపు తిరిగిన చోట రైలు వంతెన వుంది. వంతెన క్రింది భాగంలో ఎంతో కోలాహలంగా వుంది.... కొన్నివందల మంది జనం.... మోటారు బోట్లలో, తెప్పలలో, చిన్న చిన్న డింగీలలో, చెరుకు పానకం వండే పెనాలలో ఇటూ అటూ తిరుగుతున్నారు. వంతెన కింది భాగమంతా తీర్థప్రజతో నిండిపోయి వున్నట్లుగా కన్పిస్తోంది.

నదిలో సగం మునిగి మిగిలిన భాగం బయటనే మిగిలిపోయిన రైలుపెట్టె, అతిభయంకరంగా కనిపిస్తోంది. ఇంకా ఎనిమిదిబోగీలు పూర్తిగా జలసమాధి అయిపోయాయి. ఒడ్డుకు దగ్గరలో వున్న ఆఖరుబోగీ కిటికీల భాగమంతా నీటి బయటకు కన్పిస్తోంది.... వెదుళ్ళకట్టలపై 'గేస్'సెట్లు, 'సిలిండర్లు' పెట్టుకుని బోగీల తలుపులు,

కిటికీలు, అందిన చోటల్లా కోసి లోపల చిక్కుకున్న శవాలను బయటకు లాగుతున్నారు. సుమారు ఇరవై వరకూ 'వెల్డర్లు' నిన్నటి నుండీ పనిచేస్తూనే వున్నారు. కొయ్యల్లా బిగుసుకుపోయిన శవాలను పడవల్లోకి తరలించి ఒడ్డుకు చేర్చి పడుకోబెడుతున్నారు.... పైన 'హెలికాప్టరు' పెద్దరొద చేస్తూ తిరుగుతోంది. బోలెడు కార్లు, బస్సులు, లారీలు, అంబులెన్స్ వేన్లు నదికి ఇరువైపులా బారులు తీరి నిలబడి వున్నాయి.

ఎవరెవరో రాజకీయనాయకులు, మంత్రివర్యులు, ఇంకా ఎందరెందరో అధికారులు వచ్చి బ్రతికి బయటపడినవారిని పరామర్శిస్తున్నారు, ఓదారుస్తున్నారు. ధైర్యం చెప్పి వెళ్ళిపోతున్నారు.

చనిపోయిన వారి బంధువులు, స్నేహితులు శవాలదగ్గర నిలబడి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు. కాస్త ఆవలగా చిన్న చిన్న డేరాలువేసి ప్రమాదకర పరిస్థితిలో వున్న రోగులకు, చికిత్సనందిస్తున్నారు. ప్రతి పావు గంటకూ అంబులెన్స్‌లు గోల చేసుకుంటూ క్షతగాత్రులయిన వారిని పట్టణానికి తరలిస్తున్నాయి.

ఆ దృశ్యమంతా హడావిడిగానూ, హృదయవిదారకంగానూ వుంది. నిన్నటి రోజున మధ్యాహ్నం ఒంటిగంట తరువాత ఆ ఎక్స్‌ప్రెస్ ట్రయిన్ చివరి భాగంలో వున్న రిజర్వేషన్ బోగీలో తాను, సుమిత్ర, పక్కనే బాబు- రెండు నెలల పసికందు, నిద్రపోతున్నాడు. ఎదుటి సీటులోని మళయాళీ యువతులతో తాను, సుమిత్ర కబుర్లు చెబుతున్నారు.

తనకూ,సుమిత్రకూ పెళ్ళయిన ఎనిమిదేళ్ళ తర్వాత లేక లేక కల్గినబాబు! ఆమెకు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయవలసి వచ్చింది. ఇంక పిల్లలు పుట్టటం ఆమె ప్రాణానికే హానికరమని, డాక్టర్లు సుమిత్రకు ట్యూబెక్టమీ ఆపరేషను కూడా చేశారు. ఈ రెండు నెలలుగా బాబును ఆరో ప్రాణంలా పెంచుతోంది సుమిత్ర.

లేకలేక బాబు పుట్టినందుకు దక్షిణదేశంలోని యాత్రాస్థలాలన్నీ సందర్శించి రావాలనుకున్నారు ఇద్దరూ. దాని ఫలితమే ఈ ప్రయాణం! ఆఖరికి ఇలా తయారయింది.

నిన్న మధ్యాహ్నం...

రైలు అతివేగంగా పరుగెడుతూ, వంతెన మీదికి భయంకరమయిన శబ్దం చేసుకుంటూ ప్రవేశించింది. ఉలిక్కిపడిన సుమిత్ర తన చేతిని గట్టిగా పట్టుకోవటం గుర్తుంది సుధీర్‌కు. ఆ అదురుకు నిద్ర లేచిన బాబు ఏడుపులంకించుకున్నాడు. ఎదుటి సీటులోని మళయాళీ యువతి బాబుని ఆప్యాయంగా చేతుల్లోనికి తీసుకుని సముదాయించింది.

అంతలోనే...

ధడధడమంటూ భయంకరమయిన శబ్దం ఆరంభమయింది! రైలు బోగీ ఇటూ అటూ ఊగటం- ప్రక్కకు లాగేస్తున్నట్లు అన్పించటం, ఒక ప్రక్కకు మెల్లగా వాలిపోవటం

తరువాత మొత్తం బోగీ తలక్రిందులయి దొర్లిపోవటం, తాను సీటులోనుండి కింద పడటం, నేల మీద దొర్లటం అన్నీ సెకన్లలో జరిగిపోయాయి!.

తన కాళ్ళు ఏదో వస్తువు కింద ఇరుక్కుని వుండిపోయాయి.

చుట్టూ హాహాకారాలు!.... ఆర్తనాదాలు.... కేకలు.... భీభత్సంగా తయారయింది.

అంతవరకే గుర్తుంది తనకు. తర్వాత మరి ఒంటిమీద స్పృహలేదు తనకు తెలివొచ్చి కళ్ళు విప్పేసరికి సుమిత్ర తన ప్రక్కనే వుంది. "ఏమండీ! మీకేం కాలేదుకదా" అంటూ ఏడుస్తూ ఒడలంతా నిమిరింది. తాను మెల్లగా లేచి కూర్చున్నాడు.

"మన బోగీలో చాలామందిని జాలరి వాళ్ళు బయటకు లాగేరు లేకపోతే ఈ సరికి జలసమాధి అయిపోయివుండేవాళ్ళం"... అంటూ క్షణం ఆగి "... ఏమండీ! మన బాబు కనబడటంలేదు... ఏమయిపోయాడో" అంటూ ఏడవటం ఆరంభించింది.

ఓపిక కూడగట్టుకుని లేచాడు సుధీర్. ఇద్దరూ కలిసివెళ్ళి నడిఒడ్డున పిచ్చివాళ్ళలా తిరిగేరు....

పడుకోబెట్టిన వాళ్ళలో బాబు కన్పిస్తాడేమోనని వెదికారు! ఫలితం లేకపోయింది.

సాయంకాలమయ్యేసరికి ప్రజలు తండోపతండాలుగా వచ్చేశారు.... సహాయ కార్యక్రమాలు మొదలయ్యాయి.

అప్పటి నుండీ ... ఇప్పటి వరకూ గుడారాలలో, నది ఒడ్డున పడేసిన శవాలలో కొనవూపిరితో చికిత్స పొందుతున్న శిబిరాలలో బాబుకోసం వెదుకుతూనే ఉన్నారు.

నిన్నటి నుండీ ఇద్దరూ పచ్చిమంచి నీళ్ళయినా ముట్టలేదు. నీరసంగా వుంది సుధీర్‌కు. "సుమిత్రా... నువ్వు ఇక్కడే వుండు! నేను వెళ్ళి తినటానికి టిఫిను పొట్లాలు తీసుకువస్తాను.... బస్సుదగ్గర పంచిపెడుతున్నారు..." అంటూ లేచి ఆమె సమాధానం వినకుండా బయలుదేరాడు. పదినిమిషాల తర్వాత పులిహోర, పెరుగు అన్నం పొట్లాలతో తిరిగివచ్చేడు.

"సుమీ! ఇది తొందరగా తిను... పట్నంవైపుకు బస్సు బయలుదేరుతోంది.... మనం వెళ్దాం..."

"నేను రాను" అంది సుమిత్ర మొండిగా.

"నేను చెప్పేది విను... రెండువందల మందినిపైగా టౌను హాస్పిటల్లో చేర్చారట... చాలామంది ప్రాణాలతో బయటపడినట్లు చెబుతున్నారు. నిన్న మన ఎదుటి సీటులోని మళయాళీ యువతులు కూడా ఎక్కడా కన్పించలేదు... వాళ్ళతో బాబు బతికి బయటపడివుంటాడు... హాస్పిటల్లో వున్నాడేమో చూద్దాం.. అదీ కాక మనం బయటపడ్డ బోగీ అంతా గాలింపు పూర్తయిపోయింది. లోపల శవాలన్నీ బయటకు వచ్చేశాయి. ఇంక ఏమీ మిగిలిలేవు... అందుకని... నా మాట విను..." అంటూ సముదాయించి చెప్తూవుంటే అతడికంఠం పూడుకుపోయింది.

" ఏమండీ..." అంటూ మళ్ళీ గొల్లున ఏడ్చింది సుమిత్ర "ఎన్నో పూజలు చేస్తే పుట్టిన బిడ్డ, వాడుబతికే వుంటాడు. నాకా నమ్మకం పూర్తిగా వుంది. మనలనిద్దరినీ ప్రాణాలతో కాపాడిన ఆ దేవుడు మన బాబుని మాత్రం ఎందుకు రక్షించడు? వాడి గురించి అశుభం మాట్లాడకండి"

సుమిత్ర రెండు చేతులూ తన చేతుల్లోనికి తీసుకుని, సుతారంగా నిమురుతూ, అన్నాడు సుధీర్.

"సుమీ! మనిద్దరం స్వల్పమయిన గాయాలతో ఈ ఘోరప్రమాదం నుండి బయటపడ్డాం. అది అదృష్టంకాదా? వందలాది మంది మన కళ్ళ ఎదుటే... అదిగో... జలసమాధి అయిపోయారు. మరికొన్ని వందల మంది శవాల రూపంలో పడివున్నారు. ఇంకా ఎంతో మంది కాళ్ళూ, చేతులూ విరిగిపోయి చావు బతుకుల మధ్య దారుణంగా కొట్టుమిట్టాడుతున్నారు. వాళ్ళతో పోల్చుకుంటే మనం అదృష్టవంతులం కామా? నామాట విను! కాస్త ఎంగిలిపడు! బయలుదేరి ఆస్పత్రికి వెళ్దాం" అంటూ సుమిత్రను బతిమాలుతూ ఆమె చేత పెరుగు అన్నం తినిపించాడు.

"నిన్న మధ్యాహ్నం తాగిన పాలు... బాబు ఎలా వున్నాడో ... వాడు బతికితే, స్వామికి నిలువుదోపిడీ సమర్పించుకుంటాను"... అంటూ ఏవేవో మాట్లాడుతూ దైవానికి మొక్కుతోంది సుమిత్ర.

"తప్పకుండా అలాగే చేద్దాం... రా! బస్సు బయలుదేరుతోంది"

రెండు చేతులతో ఆమెను లేవదీసి బస్సు వంకకు నడిపించేడు సుధీర్.

* * *

జనరల్ హాస్పిటల్ ఆవరణ అంతా సందడిగా వుంది.

ఎదుట ఖాళీ ప్రదేశంలో పెద్ద షామియానా వేశారు.

నాలుగయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి రైలు ప్రయాణంలో చిక్కుకున్న వారి వివరాలు అందజేస్తున్నారు. నల్ల బేడ్జీలు ధరించిన వాలంటీర్లు హడావిడిగా ఇటూ అటూ కలయతిరుగుతున్నారు.

వచ్చినవారిని లోనికి తీసుకువెళ్ళి అవసరమయిన సహాయం అందజేస్తున్నారు.

సుధీర్ ఒక కౌంటరు దగ్గరకు వెళ్ళి తన వివరాలు చెప్పేడు. లోపలి యువతి అన్నీ నోట్ చేసుకుంది. తరువాత ఒక వాలంటీర్‌ని పిలిచి సుధీర్‌కి కావల్సిన సహాయం అందజేయమని అప్పగించింది.

"మీ భార్యను అలా లాంజ్‌లో కూర్చోబెట్టండి... మనం 'మార్చురీ'లోనికి కూడా వెళ్ళాల్సి వుంటుంది... ఆడవాళ్ళు తట్టుకోలేరు...." అన్నాడు వాలంటీర్.

సుధీర్‌కి గుండెల్లోంచి ఒక్కసారి బాధతన్నుకొచ్చింది. ఉబికివస్తున్న కన్నీటిని అణిచిపెట్టుకున్నాడు. ఎలాటి దృశ్యం చూడటానికయినా తాను సంసిద్ధుడు కావాలి!

సుమిత్రను లాన్‌లోని సోఫాలో కూర్చోబెట్టి వాలంటీర్ వెనుక మౌనంగా నడిచేడు.

"మీరు చెప్పిన లాంటి పసివాళ్ళు మొత్తం పద్నాలుగు మంది బ్రతికి వున్నారు... అందులో ఆరుగురయితే ఏ బాధాలేకుండా హాయిగా ఆడుకుంటున్నారు..." అంటూ వార్డులోనికి తీసుకువెళ్ళి ఉయ్యాలతొట్టెలవైపు చూపించేడు.

వణికే అడుగులతో తొట్టెల పక్కనుండి గబగబ నడిచేడు, ఉహూ బాబులేడు.

ఆఖరున దూరంగా ఒక్క ఉయ్యాల మిగిలి వుంది! 'అందులోని కుర్రవాడు తమ బాబు ఎందుకు కాకూడదూ?' ఆశగా అడుగులు వేశాడు సుధీర్.

కాళ్ళకు బ్రేకులు వేసినట్లు ఆగిపోయాడు. తన బుల్లి చేతులు ఊపుతూ కేరింతలు కొడుతున్నాడు ఆ బాబు.... అతడు... అచ్చం... ముమ్మూర్తులా తమ బాబులాగే వున్నాడు. కానీ ఆ బట్టలు తాను వేసినవి కావు. నిన్న ఉదయం తానే బట్టలు తొడిగేడు నీలం రంగు బాబాసూట్ అది. మెడలో బంగారు గొలుసు వుండాలి. అంతలోనే ఒక డాక్టర్ అటువైపుకు వచ్చేడు.

"డాక్టర్... ఈ బాబుకి బట్టలు మార్చేరా?" అడిగేడు

"లేదు.... స్నానం చేయించి పాతబట్టలే వేశాం అందరికీ. బంధువులు వస్తే సులువుగా గుర్తుపట్టాలికదా... ఆ బాబుకి వేసిన బట్టలు అతడివే..."

"మా అబ్బాయి కూడా సరిగ్గా ఇలాగే వుంటాడు..." అంటూ వుంటే సుధీర్‌గొంతు గద్గదమయింది.

"ఈ కుర్రాడు వెరీపూర్‌ఫెలో! తల్లీ, తండ్రి, సోదరి ముగ్గురూ చనిపోయారు.... ఈ పసికందు ఒక్కడే మిగిలేడు ఆ కుటుంబానికి. బంధువులు వచ్చి ఆ ముగ్గురి శవాలు తీసుకుపోయారు పొద్దుట..."

"మరి ... ఈ పసిబిడ్డ సంగతి?"

"వీడిని తీసుకువెళ్ళటానికి ససేమిరా అంగీకరించలేదు వాళ్ళు"

"ఎందుకని?" ఆత్రుతగా అడిగేడు సుధీర్

"వీడుపుట్టాక ఆ ఇంట్లో అన్నీ అనర్థాలు జరిగేయట! ఇపుడు ఏకంగా మొత్తం కుటుంబాన్నే పొట్టన బెట్టుకున్నాడని శాపనార్థాలు పెట్టి, తిట్టిపోసి మరీ వెళ్ళిపోయారు వాళ్ళు. పాపం! ఆ పసివాడు ఏం చెయ్యగలడు చెప్పండి... మనవాళ్ళ మూర్ఖత్వానికి హద్దులులేవు..." అన్నాడు డాక్టరు దీర్ఘంగా నిట్టూర్పు వదుల్తూ.

"మరి... వీడిని ఏం చేస్తారు?"

"అనాధ శరణాలయానికి అప్పగిస్తాం...."అంటూ కదలి వెళ్ళిపోయాడు డాక్టరు.

సుధీర్ మౌనంగా నిలబడిపోయాడు.

"మార్చురీకి వెళ్దామా? అడిగేడు వాలంటీర్

"పదండి" అంటూ అతని వెనుక భయంగా అడుగులు వేస్తూ నడిచేడు. మార్చురీ

లోనికి అడుగుపెట్టగానే ఒడలు ఝల్లుమంది. ఏదో వింత వాసన ముక్కుకు తగిలి కడుపులో దేవినట్లు అయింది. బయటకు పరుగున వచ్చి వాంతి చేసుకున్నాడు. తరువాత ముఖం తుడుచుకుని లోనికి వెళ్ళేడు. రుమాలు మూతికి అడ్డంపెట్టుకుని ఇసుముక్కల మధ్య పడివున్న శవాలను చూస్తూ నడవసాగేడు.

పసివాళ్ళ శవాలు ఎనిమిది వున్నాయి. వాటిలో కొన్నిటికి కాళ్ళు, మరికొన్నిటికి చేతులు లేవు. శవాల ప్రక్కనే వాళ్ళ బట్టలు, మొలలో కట్టిన పూసలు... బొంతలు... ఇలాంటివన్నీ పేర్చివున్నాయి భయంగా వాటి వంక చూస్తూ అంతా కలయతిరిగేడు సుధీర్.

ఎక్కడా బాబుశవం కన్పించలేదు. కాళ్ళీడ్చుకుంటూ బయటకు వచ్చేడు. తిరిగి వార్డు దాటి బయటకు వస్తుంటే ఇంతకుముందు పలుకరించిన డాక్టరు కనిపించేడు.

"ఏమయింది?" అడిగేడు అతడు. సుధీర్ నిరాశగా తలవూపేడు.

"ఇటురండి" అంటూ డాక్టర్ ఓ గది వంకకు నడిచేడు. లోపల పెద్ద టేబిలు వుంది దాని మీద తెల్లనిగుడ్డ పరచివుంది. పైన వరుసలో కొన్ని బట్టలు, వస్తువులు పేర్చివున్నాయి. ప్రక్కనే ఓ పోలీసు కాపలా నిలబడి వున్నాడు.

"ఇవి చూడండి..." అన్నాడుడాక్టరు.

నీలంరంగు బాబాసూట్... ప్రక్కనే బంగారు గొలుసు

"డాక్టర్! ఇవి మా మాబాబువే. ఎక్కడ? బాబు ఎక్కడున్నాడు?" దాదాపు అరిచినట్లే అడిగేడు.

"ప్లీజ్ ఎగ్జయిట్ కాకండి" అన్నాడు డాక్టరు.

"ఏడీ మా బాబు?"

"సారీ... కొన్ని దేహాలు గుర్తించటానికి వీలు లేనంతగా నుగ్గునుగ్గు అయిపోయాయి. మాంసం ముద్దలు తప్ప ఆకారాలులేవు... మార్చురీలో వుంచేందుకు కూడా అనువుగా లేవు... అలాంటి శవాలు ఆరింటిని ఉదయం పూడ్చేశారు... వాటి శరీరాలనుండి వేరయిన బట్టలు, వస్తువులు గుర్తుగా ఇక్కడ వుంచేం... రియల్లీ వెరీ సారీ"

సుధీర్ రెండు చేతుల్లో ముఖం దాచుకుని రోదిస్తూ వుండిపోయాడు. కొంతసేపు డాక్టర్ చేతులు అతడి భుజం మీద అనునయంగా కదిలేయి.

"ఇదిగో... ఈ ఫారం మీద సంతకం చేసి చిరునామా రాయండి... బట్టలు తీసుకు వెళ్ళొచ్చు... గొలుసు మాత్రం విచారణ పూర్తి అయిన తర్వాత మీ చిరునామాకు పంపిస్తారు..." అంటూ కాగితాలు అందించేడు.

సుధీర్ ఆ కాగితం నింపి, సంతకం చేసి రక్తమయమైపోయివున్న బాబు డ్రెస్ తీసుకుని బయటకు వస్తూ అన్నాడు "డాక్టర్, బయట గంపెడు ఆశతో కూర్చుని వుంది

నా భార్య ఆమెకు ఈ బట్టలు ఎలా చూపించగలను? ఒక్కగానొక్క బిడ్డ ఇలా అయ్యేడు ఇంక నాభార్యకు పిల్లలు కలిగేయోగం కూడాలేదు..."

"నేను అర్థం చేసుకోగలను.... రియల్లీ ఐ పిటీయు"

"డాక్టర్! నాకో సహాయం చేయగలరా?"

"ఏమిటి?"

"ఇందాక మీరు నాకో బాబుని చూపించేరుకదా, అచ్చం మా అబ్బాయిలాగే వున్నాడని చెప్పేను కదా... అతడిని వాళ్ళ బంధువులు ఎవ్వరూ తీసుకు వెళ్ళలేదు... అనాధశరణాలయానికి ఇచ్చే బదులు మాకు ఇవ్వండి... మా కుర్రాడిలాగే పెంచుకుంటాం..."

డాక్టరు తలపంకించేడు "ష్యూర్, తప్పకుండా... కాకపోతే కొన్ని ఫార్మాలిటీస్ వున్నాయి. కొన్ని నిబంధనలకు ఒప్పుకుని సంతకం చేయాలిమీరు. అందుకు రెడీయేనా?" అంటూ అడిగేడు.

"రెడీ డాక్టర్"

"నాతో రండి" అంటూ వార్డులోనికి నడిచేడు సుధీర్ చివరి ఉయ్యాల తొట్టెలోంచి బాబును తీసిఎత్తుకున్నాడు. అంతా తమబాబుపోలికే. పిడికిళ్ళు బిగించి ఆడటం ఆనవ్వు అంతా ఆ పోలికే రంగులో కూడా తేడాలేదు. బాబుకి మొలతాడు కట్టి, నీలండ్రెస్ తొడిగేడు. దగ్గరకు హత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. పావుగంటలో ఫార్మాలిటీస్ పూర్తి అయ్యేయి. డాక్టర్‌కి కృతజ్ఞతలు తెలియజేసి ఏడుస్తున్న బాబును సముదాయిస్తూ బయట షామియానా లోనికి వచ్చేడు.

అల్లంత దూరం నుంచే భుజంమీది బాబుతో వస్తున్న సుధీర్‌ని చూసింది సుమిత్ర. పరుగెత్తుకుంటూ వచ్చి సుధీర్ చేతుల్లోంచి ఏడుస్తున్న బాబును తీసుకుని ముద్దులతో నింపేసింది.

"ఊరుకోబాబూ! ఊరుకో" అంటూ ఆప్యాయంగా ఒళ్ళంతా తడిమి గుండెలకు హత్తుకుంది. ఆమె కనులు ఆనందంతో మెరిసిపోతున్నాయి. ముఖమంతా సంతోషం నిండిపోయి వుంది. గబగబా జాకెట్ క్రింది హుక్ తీసి స్తన్యాన్ని బాబునోటికి అందించింది.

బాబు ఆబగా పాలుతాగటం ఆరంభించేడు. పసివాడి వెంట్రుకలను సవరిస్తూ పాలు కుడుపుతున్న దృశ్యాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాడు సుధీర్.

అంతలోనే హఠాత్తుగా సుమిత్ర కళ్ళల్లో నీరు తిరగటం గమనించేడు.

"పాలు తాగే నా బాబు బుల్లి పెదాలు రెండూ నాకు గుర్తే" అంటూ సుధీర్ వంక చూసి విషాదంగా నవ్వింది!! సుధీర్ ఆమె వంక భయంగా చూసేడు.

"పదండి! వెళ్ళిపోదాం" అంటూ బాబుని గుండెలకు హత్తుకుని సుమిత్ర ముందుకు నడుస్తూ వుంటే మెల్లగా అనుసరించేడుసుధీర్.

★

(ఆంధ్రభూమి వీక్లీ ప్రత్యేక సంచిక 1982)